ఎంపీ విజయసాయిరెడ్డిని కలిసిన ‘కదిరి’

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల వైసీపీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన సందర్భంగా రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే వైసీపీ నాయకులు కదిరి బాబురావు మర్యాద పూర్వకంగా కలిశారు. పూలబొకే అందజేసి శాలు వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

అర్హులందరికీ పభుత్వ పథకాలే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దర్శి : రాష్ట్రంలోని ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రజలు కు అందుతున్నాయా లేదా అనేది తెలుసుకోవటం కోసం జగనన్న ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను ఏర్పాటు చేసిందని ఎమెల్యే మద్దిశెట్టి వేణు గోపాల్ అన్నారు. దర్శి ఎస్.సి కాలనీలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం జరిగింది. ఎమెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి తో నే సాధ్యం అవుతుంది అని దర్శి ఎమెల్యే మద్దిశెట్టి వేణు గోపాల్ అన్నారు. ఆయన వెంట దర్శి ఎయంసి చైర్మన్ మిల్లర్ బుజ్జి, కుమ్మిత అంజిరెడ్డి, గోపు ఎర్రయ్య కుంటా అచ్చరావు గోళ్లపాటి, అచ్చయ్య, చిన్న స్టీవెన్, వేమిరెడ్డి చెన్నారెడ్డి, సుశీల ప్రతాప్ కట్టే కోట హరీష్, కరిపి రెడ్డి సుబ్బారెడ్డి, పథకామురురవి, ఎయంసి డైరెక్టర్‌లు వెంకటేశ్వరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి

- ప్రకాశం జిల్లాకు ఒరిగిందేమీ లేదు
- వెలుగొండ ప్రాజెక్టుపై మాట నిలబెట్టుకోని ముఖ్యమంత్రి
- కనిగిరి ఎమ్మెల్యే స్థానికం కాకపోబట్టే అభివృద్ధి శూన్యం
- జిల్లా అభివృద్ధికి సీపీఐ పటిష్ట ప్రణాళిక
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఇంటికి సాగనంపాలని పిలుపు

ప్రజలకు అభివాదం చేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఐ పార్టీ నాయకులు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణను ఆహ్వానిస్తున్న ఎంఎల్ నారాయణ, వై.రవీంద్రబాబు, యాసిన్

సీపీఐ ర్యాలీ

విశాలాంధ్ర-కనిగిరి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు అవస్థలు పడుతున్నారని వారిని సాగనంపాల్సిందేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. వైసీపీ పాలనలో దోపిడీదారుల రాజ్యం నడుస్తుందని ప్రజలను అన్ని రకాలుగా దోచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ వ్యవస్థలను ధ్వంసం చేశారని, రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి అధోగతి పాలైందని అన్నారు. ‘రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి’ అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర మంగళవారం కనిగిరికి చేరుకుంది. కనిగిరి సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణకు ఘన స్వాగతం పలికారు. హనీఫ్ స్థూపం నుంచి పామూరు బస్టాండ్ లోని గుజ్జుల యల్లమందరెడ్డి, సరళ దేవి చౌక్ వద్దకు సిపిఐ నాయకులు, కార్యకర్తలు, ఏఐఎస్ఎఫ్, కార్మిక సంఘాల ట్రేడ్ యూనియన్ కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండంటూ నినాదాలు చేశారు. పామూరు బస్టాండ్ లోని గుజ్జుల యల్లమందరెడ్డి, సరళ దేవి విగ్రహాలకు నివాళు లర్పించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ యాసిన్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రకాశం జిల్లాకు ఒరిగిందేమీ లేదని అభివృద్ధి శూన్యమన్నారు. ప్రకాశం జిల్లాకు పశ్చిమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసే అంశంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట తప్పారని మడమతిప్పారని అన్నారు. ఒంగోలులో పాలడైరీని గుజరాత్ అమూల్ కంపెనీకి గంప గుత్తేగా ఇచ్చేసారన్నారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి వైసీపీ పాలకులు మర్చిపోయారు అన్నారు. కనిగిరి ప్రాంతానికి ట్రిబుల్ ఐటీ ఏర్పాటు చేస్తే ఎడ్యుకేషన్ హబ్ గా మారుతుందని అయితే ఇంతవరకు ట్రిబుల్ ఐటీ కి ఇటుక రాయి వేయలేదు అన్నారు. పామూరు నిమ్జ్ ఊసే లేదన్నారు. కనిగిరి ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ స్థానికుడు కాకపోవట్టే అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. జగనన్న కాలనీల పేరుతో ఇచ్చిన స్థలాలను అమ్ముకోవడం అలాగే జగనన్న కాలనీల్లో మట్టి నింపడంలో డబ్బు తినడానికి కనిగిరి ఎమ్మెల్యే కి సమయం కుదిరింది తప్ప నియోజకవర్గ ప్రాంతానికి.. ఈ ప్రాంత అభివృద్ధికి ఏమాత్రం ఆలోచించిన పరిస్థి లేదని అంటూనే ఎక్కడి నుంచో నాయకులను వలస తెచ్చుకుంటే ఇదే పరిస్థితి మన ప్రాంతానికి వస్తుందని ఇప్పటికైనా ఆలోచించాలని ప్రజలను కోరారు. భవిష్యత్తులో జిల్లా అభివృద్ధికి, కనిగిరి ప్రాంత అభివృద్ధికి కమ్యూనిస్టు పార్టీ కార్యాచరణ ప్రణాళిక రుపుపొందించబోతుందని ప్రకటించారు. మన ప్రాంతాన్ని రక్షించుకోవడానికి భవిష్యత్తులో పోరాటం చేస్తుంది. ప్రజలు భాగ స్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై రవీంద్రబాబు, సయ్యద్ యాసీన్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై గళం విప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలం భిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గద్దదించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ప్రదర్శన విప్లవ గేయాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్య క్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రమేష్ బాబు, సయ్యద్ మౌలాలి, పోతల ప్రభాకర్, షేక్ గులాం హుస్సేన్, జి పి రామారావు, వజ్రాల సుబ్బారావు, ఎస్‌కేవై పెద్ద మస్తాన్, గుజ్జుల బాలిరెడ్డి, సీనియర్ సిపిఐ నాయకులు బ్యంగి సుబ్రహ్మణ్యం, డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి పందిటి మోహన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ లక్ష్మారెడ్డి, పవన్ కళ్యాణ్, ఇఫ్రాస్, ఏఐవైఎఫ్ నాయకులు పుట్ట సుబ్బారావు, మీరావలి, కనిగిరి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాసర్, కిరణ్, ప్రజా సంఘాల నాయకులతో పాటు ఏఐటీయూసీ కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే ముందస్తు ఎన్నికలకు మోదీ

- కర్ణాటక ఫలితాలే దేశవ్యాప్తంగా పునరావృతం
- మతోన్మాద బీజేపీని ఓడించేందుకు ప్రజలు సంసిద్ధం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర-మార్కాపురం : వచ్చే ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకున్న ప్రధాని నరేంద్ర మోడీ ముందస్తు ఎన్నికలకు వెళ్లి కాస్తా హడావుడి చేయాలని ప్రయత్నిస్తున్నారని, అయితే ఎన్నికలు ఏ క్షణం వచ్చిన దేశ ప్రజలు ఓడించి, బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో బయలుదేరిన బస్సు జాత సోమవారం సాయంత్రానికి మార్కాపురం చేరుకుంది. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం స్థానిక పూల శాంతిభవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లాభాలతో నడుస్తున్న ఎల్ఐసి , పౌర విమానాయన శాఖ, హిందుస్థాన్ పెట్రోల్ కెమికల్స్, గంగవరం, కృష్ణపట్నం పోర్టు, బిఎస్ఎన్ఎల్, రైల్వే శాఖ తదితర లక్షల కోట్ల రూపాయల విలువచేసే వివిధ ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ప్రభుత్వం నష్టల బాట చూపుతూ మరోవైపు అంబానీ ఆదానీలకు కారు చౌకాగా విక్రయిస్తుందని అయన తీవ్రంగా విమర్శించారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 142 కోట్ల మంది ప్రజలకు తాను ప్రతినిధిని అనే విషయం మరచిపోయిన ప్రధాని మోడీ తన స్థాయిని దిగదార్చి మతం పేరుతో నిస్సిగ్గుగా ఓట్లు అడిగారని, అయితే ఆ రాష్ట్ర ప్రజలు ఆయనకు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. దీంతో ఈ రంగాలను నమ్ముకుని జీవిస్తున్న కోట్లాదిమంది కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని అన్నారు. ఏపీలో జగన్ పాలన గాడి తప్పిందని, అభివృద్ధి అనే పదం కనుచూపుమేరలో ఎక్కడ కనిపించడం లేదని విమర్శించారు. రాష్ట్రం వ్యవసాయ రంగం మీద ఆధారపడిన విషయాన్ని ముఖ్యమంత్రి మర్చిపోయారని విమర్శించారు. అందుకు ఉదాహరణే ఏ ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా పూర్తి కాకపోవడమేనని గుర్తు చేశారు. రెండు లక్షల కోట్ల రూపాయల రాష్ట్ర బడ్జెట్ ఉండగా అందులో 10% కూడా సాగునీటి ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి ఖర్చు పెట్టడం లేదని, ఇలా అయితే ఈ ప్రాజెక్టులు ఎప్పటికి పూర్తవుతాయని ఆయన ప్రశ్నించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి అందే నాసరయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి శ్రీనివాస్, జిల్లా ఏఐటియుసి కార్యదర్శి ఎస్‌కె కాశింలు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను సన్మానించిన శాసనాల

విశాలాంధ్ర-మార్కాపురం : రాష్ట్ర రాజధానికి ఎంతో ఉదారంతో భూములిచ్చిన అమరావతి రైతుల పక్షాన నిలిచి పోరాడిన గొప్ప నాయకుడు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అని జిల్లా టీడిపి అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ అధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్రలో భాగంగా రామకృష్ణ సోమవారం సాయంత్రం మార్కాపురం చేరు కున్నారు. ఆయన్ను జిల్లా టిడిపి అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం మంగళవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు.

బస్సు యాత్రకు బయలుదేరిన సీపీఐ నాయకులు



విశాలాంధ్ర-సీఎస్‌పురం : భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సీపీఐ చేపట్టిన బస్సు యాత్ర మంగళవారం కనిగిరికి చేరుకుంది. ఈ కార్యక్రమానికి సీఎస్‌పురం మండలంలోని సీపీఐ మండల కార్యదర్శి ఎస్‌కెవై పెద్దమస్తాన్ ఆధ్వర్యంలో కనిగిరి బయలుదేరి వెళ్లారు. కనిగిరిలోని హనీఫ్ స్థూపం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి పామూరు బస్టాండ్‌లో బహిరంగసభ నిర్వహించారు. సీపీఐ కార్యక్రమంలో గువ్వల నరసింహులు, రాగి అంకయ్య, రాగి అంకమ్మ, గురవయ్య, ఏడుకొండలు, వై.రత్తయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

విశాలాంధ్ర-త్రిపురాంతకం : త్రిపురాంతకం మండల తశీల్దార్ కిరణ్‌కి మండల యండి ఆపరేటర్లు వినతిపత్రం అందించారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేసే సమయంలో రెండు సార్లు వేలిముద్రలు వేయించడం కష్టం అవుతుందని వారు తమ బాధ వివరించారు. గతః నెలల్లో బాగా పంపిణీ చేసినందుకు ఆపరేటర్లు,ప్రభుత్వం పట్ల ప్రజలు అభినదిస్తున్నరని అన్నారు.ఇప్పుడు సర్వరలు సక్రమంగా పని చేయక పోవడంతో వచ్చిన లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారని వారు తెలిపారు.

తిరుపతి బహిరంగ సభను జయప్రదం చేయండి : రామయ్య

విశాలాంధ్ర-త్రిపురాంతకం : సెప్టెంబర్ 8న తిరుపతిలో జరుగు భారీ బహిరంగ జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య పిలుపు నిచ్చారు. త్రిపురాంతకం మండలంలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిన్న మార్కాపురంలో జరిగిన సీపీఐ ప్రచార జాత, బస్ జాతలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేసిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. యర్రగొండపాలెం నియోజక వర్గం నుండి అధిక సంఖ్యలో ప్రజలు తరలించిన నియోజక వర్గ కార్యదర్శి శ్రీనివాస్, త్రిపురాంతకం మండల కార్యదర్శి బాణాల రామయ్యలను సీపీఐ రాష్ట్ర నాయకులు అభినందించారు అని అయన తెలిపారు. అలాగే సెప్టెంబర్ 8న జరుగు బారి బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలించి సభను జయప్రదం చేసేలా కృషి చేయాలన్నారు. రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో చేస్తున బస్ జతను, తిరుపతి బహిరంగ సభ జయప్రదం చేయాలని నియోజక వర్గ కార్యదర్శి డి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 8న జరుగు బహిరంగ సభకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నందు మాతృభాషా దినోత్సవంను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ శ్రీనివాసరెడ్డి గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు సిహెచ్ ప్రవీణ్ కుమార్ మాతృభాషా దినోత్సవం మరియు గిడుగు వెంకట రామమూర్తి యొక్క ప్రాముఖ్యతను పిల్లలకు వివరించడం జరిగింది.

నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా డిస్ట్రిక్ట్ స్పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో 10 సంవత్సరాల లోపు నిర్వ హించిన బ్యాడ్మింటన్ పోటీల్లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్న పొనకల లక్ష్యను అభినందిస్తున్న ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత

\- విశాలాంధ్ర, ఒంగోలు

టీటీడీ పాలక మండలి మొత్తాన్ని రద్దు చేయాల్సిందే

విశాలాంధ్ర-ఒంగోలు : టిటిడి చైర్మన్ మరియు పాలక మండలి మొత్తాన్ని రద్దుచేయాలని బిజెపి ఒంగోలు నియోజక వర్గం కన్వీనర్ యోగయ్య యాదవ్ డిమాండ్ చేశారు. నిర్వహించిన సంతకాలు సేకరణలో మహిళలు స్పందిస్తూ ఆ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవీ భాధ్యతలు చేపట్టిన మరుసటి రోజు నుండే హిందువుల గుళ్ళకు రక్షణ లేకుండా పోయిందని. ఓటుకి రూ. 2వేలు తీసుకొని ఓట్ వేసిన వారందరూ తలలు పట్టుకొని కూర్చుంటున్నా రన్నారు. యోగయ్య యాదవ్ మాట్లడుతూ భక్తులు. ప్రజలు. ముఖ్యంగా మహిళల స్పందన చూస్తుంటే ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడినట్లు చాలా స్పష్టముగా తెలుస్తోందన్నారు. వచ్చే ఎన్నికలలో జగన్ పార్టీకి తగిన బుద్ది చెప్పాలన్నారు.ఈ కార్యక్రమములో బిజెపి అర్బన్ సెల్ జిల్లా అధ్యక్షులు తిరుమల,ఐటి సెల్ ఇంచార్జ్ గుర్రము సత్యనారాయణ, 3వ మండల అధ్యక్షులు గుర్రం రంగనాథ్, 3వ మండల ప్రధానకార్యదర్శి మిరియం శ్రీనివాసరావు యాదవ్, సామి సత్యనారాయణ, సుధీర్, గిరి తాత,తాతా స్వామి పాల్గొన్నారు.

స్మార్ట్‌జన్ స్కూల్‌లో మాతృభాష, జాతీయ క్రీడా దినోత్సవం



విశాలాంధ్ర-శింగరాయకొండ : శింగరాయకొండలోని స్మార్ట్‌జన్ గ్లోబల్ స్కూల్ నందు మంగళవారం మాతృభాష, నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్కూల్ కరస్పాండెంట్ గీతారాణి పాల్గొని మాట్లాడుతూ తెలుగు భాషను గ్రాంధికం నుంచి వ్యవహారిక భాషగా సాధారణ ప్రజల్లోకి సైతం తెలుగుభాష యొక్క గొప్ప తనాన్ని చాటిచెప్పిన వ్యక్తి గిడుగు రామ్మూర్తి అని కొనియాడారు. హాకీ ఆట ద్వారా భారత దేశ గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన వీరుడు ధ్యాన్‌చంద్ అని అన్నారు. స్కూల్ చైర్మన్ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి ధ్యాన్‌చంద్, అంబేద్కర్ మహనుభావుల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు

జిల్లా ఎస్పీ మల్లికగర్గ్

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రముఖ తెలుగు రచయిత, భాషావేత్త, సామాజిక దార్శనికులు, వ్యవహారిక భాషను సమర్థిస్తూ పోరాటం చేసిన గిడుగు వెంకట రామమూర్తి 160 వ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మల్లికగర్గ్, పోలీస్ అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాదని, వాడుక భాషా ఉద్యమ పితామహుడని, గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, విలువను తెలియజెప్పిన మహనీయుడని, శిష్టజన వ్యవహారికభాషను గ్రంథరచనకు స్వీకరింపజేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చతెలుగు చిచ్చర పిడుగు గిడుగు రామ్మూర్తి గారని, ఆయన కృషి వల్ల కొద్దిమందికే పరిమితమైన చదువు వ్యావహారికభాషలో సాగి, అందరికీ అందుబాటులోకి వచ్చిందని, పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి సృజనాత్మకశక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైందని కొనియాడారు. తెలుగు భాషకు ఆయన చేసిన సేవలకు గుర్తుగా మద్రాసు ప్రభుత్వం “రావు బహదూర్” బిరుదు తో సత్కరించిందని, “కైజర్ హింద్” బిరుదు ఆయనను వరించిందని, ఆయన జయంతిని “తెలుగు భాషా “జయంతి” సందర్భంగా ఆ మహనీయునికి నమస్సుమాంజలు అర్పించడం మనందరికీ గర్వకారణమని తెలిపారు.

రాజీనామా బాటలో ఎండీయూ ఆపరేటర్లు

డీటీకి వినతి

విశాలాంధ్ర-గిద్దలూరు : రెండున్నర ఏళ్లుగా సజావుగా సాగుతున్న రేషన్ పంపిణీ వ్యవస్థలో డబుల్ తంబు సిస్టం సమస్యగా మారిందని, అధికారులు చర్యలు తీసుకుని తమ పని భారాన్ని తగ్గించాలని కోరుతూ ఎండియు ఆపరేటర్లు స్థానిక డిప్యూటీ తాసిల్దార్ సుబ్బారావు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా వైస్ ప్రెసిడెంట్ రమేష్ మాట్లాడుతూ ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తున్న సమయంలో జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన ప్రతి కార్డు దగ్గర నుండి 2సార్లు వేలిముద్రలు తీసుకోవడం మరియు సర్వర్లు మొరాయించడంతో గత 30 నెలలుగా ఇంటింటికి నిత్యావసర సరుకులు అందించిన ఎండియు వ్యవస్థ మీద ప్రభుత్వం మీద మంచి అభిప్రాయం ఏర్పడింది. వేలిముద్రలు సర్వర్ సమస్య వలన ప్రభుత్వం మీద, ప్రజా పంపిణీ వ్యవస్థ మీద తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడడం, పంపిణీ ఆలస్యమై చాలా మంది కార్డుదారులకు రేషన్ సరుకులు అందించలేకపోతున్నామని, ఈ కారణాల చేత ఎండియు ఆపరేటర్లపైన హెల్పర్ల పైన దాడులకు దిగుతూ, నానా దుర్భాషలాడు తున్నారని, ఇప్పుడు ఇస్తున్నటువంటి జీవితం నుండి అదనంగా హెల్పర్‌కు రూ. 7వేలు నుంచి 9వేలు వరకు ఇస్తున్నాము. ఇవి పోను మాకు గతంలో రూ.5000 నుంచి 7000 వరకు మాత్రమే మిగిలేది ఇప్పుడు 2 వేలుముద్రలు వలన డిస్ట్రిబ్యూషన్ 20 తేదీ అయినా కూడా పూర్తికానందువలన హెల్పేర్ సమస్యగా తీవ్రంగా ఉందని, గతంలో ఇస్తున్నటు వంటి రూ.7వేలు అదనంగా కూలి అడుగుతున్నారు. ఈ ఆర్థిక భారాన్ని ఎండియూ ఆపరేటర్లు భరించ లేని స్థితిలో ఉన్నారన్నారు. గిద్దలూరు నియోజకవర్గ ఎండియు ఆపరేటర్లు నాయబ్, చంద్రశేఖర్ రెడ్డి, రాజమోహన్, బాలు నాయక్ పాల్గొన్నారు.

గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని ఎడమకల్లు గ్రామంలో నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పాల్గొన్నారు. ఎడమకల్లు గ్రామానికి చెందిన దద్దనాల తిరుమలయ్య నూతన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై తిరుమలయ్య కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి సారె వెంకట నాయుడు, స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవహారిక భాషకు పట్టం కట్టిన గిడుగు

విశాలాంధ్ర-గిద్దలూరు : వ్యవహారిక భాష తెలుగుకు భాషోద్యమ కర్త,వ్యవహారిక భాష పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు అందించిన సేవలు మరువలేనివని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ బి రవీంద్రారెడ్డి అన్నారు.గిద్దలూరు లోని ఏపీ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర,బాలికల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన తెలుగు భాష దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా గిడుగు రామ్మూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వాడుక భాషతోనే విద్య సామాన్య ప్రజలకు అందుబాటులోకి వస్తుందని భావించిన గిడుగు రామ్మూర్తి పంతులు ఆ దిశగా ఉద్యమించారని అన్నారు.ఆయన విశేష కృషితోనే వ్యవహారిక భాషలో రచనలు జరిగాయన్నారు.

మాదక ద్రవ్యాల నివారణకు సమన్వయంతో పనిచేయాలి

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ముత్తు పదార్థాలు, ఇతర మాదక ద్రవ్యాల తయారీ, సాగు, రవాణా, వినియోగాన్ని నివారించడానికి సంబంధిత శాఖలు మరింత సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.శ్రీనివాసులు స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల నివారణపై జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశము మంగళవారం ఆయన అధ్యక్షతన కలెక్టరేట్లో జరిగింది. జిల్లాలో మాదక ద్రవ్యాల సాగు, రవాణా, వినియోగం, వీటివలన చట్టపరంగా, ఆరోగ్య పరంగా ఎదురయ్యే ఇబ్బందులపై కల్పిస్తున్న అవగాహనా కార్యక్రమాల గురించి ఈ సందర్భంగా ఆయన సమీక్షించారు. మాదక ద్రవ్యాలను సాగు స్థాయిలోనే కట్టడి చేసేలా ఈ-క్రాప్ బుకింగ్ సమయంలో వ్యవసాయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన ఆదేశించారు. వీటి రవాణా జరగకుండా చెక్ పోస్ట్ వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో రవాణా మరియు మార్కెటింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ట్రెమడాల్ డ్రగ్స్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందుల షాపులలో విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డ్రగ్స్ వినియోగం వలన సామాజికంగా, చట్టపరంగా ఎదురయ్యే ఇబ్బందుల గురించి వలస కార్మికులు ఉంటున్న ప్రదేశాలలోనూ, కాలేజీలలోనూ ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు రెగ్యులర్ గా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. విద్య, అటవీ, పోలీసు, సెల్ అధికారులు సమన్వయంతో ఈ దిశగా చర్యలు తీసుకోవాలని వారికి ఆదేశాలు జారీ చేశారు. హాస్టళ్లలోని విద్యార్థుల ప్రవర్తనను కూడా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఏ.ఎస్.పి. నాగేశ్వరరావు, ఒంగోలు ఆర్.డి.ఓ. విశ్వేశ్వరరావు, కనిగిరి ఆర్.డి.ఓ. అజయ్ కుమార్, ఆర్.ఐ.ఓ. సైమన్ విక్టర్, ఒంగోలు జి.జి. హెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఎఫ్.ఆర్.ఓ. ఏ.వి. నాగేంద్రరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. శ్రీనివాసరావు, డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ వి.ఎస్.జ్యోతి, రిమ్స్ మెడికల్ కాలేజీ' ప్రిన్సిపాల్ సి.హెచ్. సుధాకర్, మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ కె. రామచంద్రరావు, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఉపేంద్ర, జి.జి.హెచ్, మానసిక, వైద్య విభాగ అధిపతి డాక్టర్ ఐ. లక్ష్మీ నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైమండ్ జూబ్లీ వేడుకలు సందర్భంగా ప్రఖ్యాత హాకీ ప్లేయర్ అయిన మేజర్ ధ్యాన్ చంద్ జన్మదిన వేడుకలు, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో సుమారు ఐదు కిలోమటర్ల వాకతన్ మరియు వివిధ క్రీడ కార్యక్రమాలు నిర్వహించారు. వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ నున్నా త్రిమూర్తులు, ఉద్యాన కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్న గౌడ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకై 1న విజయవాడలో భారీ ధర్నా

విశాలాంధ్ర-సీఎస్‌పురం : సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ వై నాట్ ఓపిఎస్ పేరిట విజయవాడలో సెప్టెంబర్ 1న జరగనున్న ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఏపీటిఎఫ్ సియస్‌పురం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జే ఎస్ ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ ఒక ప్రకటనలో కోరారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం వెంటనే సిపిఎస్‌ను రద్దు చేయాలని జిపిఎస్ లాంటి పథకాలను ఒప్పుకునేది లేదని ఎలాంటి షరతులు లేకుండా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని మరియు తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్ర పటానికి. గిడుగు వెంకట రామ మూర్తి, చిత్ర పటానికి ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.నారాయణరెడ్డి, స్టాఫ్ సెక్రటరీ వి.నాగమూర్తి, ఫిజికల్ డైరెక్టర్స్ పి.రామా నాయక్ హెచ్.రామా నాయక్, ఎస్.ఏ. తెలుగు అనుసూయ దేవి గారు పూలమాలలు వేసి నివాళు అర్పించి అనంతరం క్రీడా జ్యోతి ప్రజ్వలన చేశారు. క్రీడా ప్రతిజ్ఞ చేశారు. తదుపరి విద్యార్థుల క్రీడా వందనం స్వీకరించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.నారాయణ మాట్లాడుతూ క్రీడా రంగానికే వన్నె తెచ్చిన ఆణిముత్యం ధ్యాన్ చంద్ అని, ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు.స్టాఫ్ సెక్రటరీ వి.నాగమూర్తి మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలు కూడా ఎంతో అవసరం, పట్టుదలతో క్రీడల్లో కూడా రాణించాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు పి.రామా నాయక్ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ స్ఫూర్తి దాయక జీవితాన్ని, క్రీడల ఆవశ్యకతను, ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం ఆటల-పోటీలు నిర్వహించి గెలుపొంది విజేతలైన బాల, బాలికలకు బహుమతులు ప్రధానం చేసి, విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

విశాలాంధ్ర-దర్శి : పారిశుధ్య కార్మికులు సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలి అని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణు గోపాల్‌ను మంగళవారం కలసి సిఐటియు నాయకులు కోరారు. 10నెలలు పెండింగ్ వేతనాలు పూర్తిగా ఇవ్వాలని, పంచాయతీ లతో సంబంధం లేకుండా ప్రభుత్వమే వేతనాలు నెల నెల ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన 10వేతనం జి.ఓ అమలు చేయాలి, రాజకీయ కారణాలతో కార్మికులు తొలగింపులు, వేధింపులు ఆపాలని తదితర డిమాండ్‌లతో కూడిన వినతిపత్రంను ఎమ్మెల్యేకు అందచేశారు. ఆయన సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు తాండవ రంగారావు, కార్మిక నేతలు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర-జరుగుమల్లి : మండలంలోని కామేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేజర్ ధ్యాన్చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్స వాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంతర పాటశాల స్థాయిలో వివిధ క్రీడంశలలో విజయం సాధించిన క్రీడా కారులను మెడల్స్, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు మాట్లాడుతూ విద్యార్థుల శారీరక మానసిక సామాజిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో ఉపయోగ పడతాయి అని ప్రతి విద్యార్థి క్రీడలలో పాల్గొనాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఏలూరి రాంబాబు రూ 16000/- విలువగల క్రీడా సామగ్రిని పాటశాలకు బహుకరించారు.తదుపరి తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు తెలుగు భాష గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. పలు అంశా లలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యల్. అనూరాధ, వ్యాయామ ఉపాధ్యాయలు యన్ కోటేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయులు ప్రసాద రావు, అనంతలక్ష్మి, సంపూర్ణమ్మ ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

విశ్రాంత లెక్చరర్ పాస్టర్ సాదు సుగుణరావు మృతి

విశాలాంధ్ర-పామూరు : విశ్రాంత లెక్చరర్, సామాజిక కార్యకర్త భక్తులకు సందేశాన్నిచ్చే పాస్టర్ సాదు సుగుణ రావు గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. మంగళవారం వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్ రెడ్డి,మండల బూత్ కమిటీ అధ్యక్షులు గట్ల విజయభాస్కర్‌రెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు జొన్నలగడ్డ గోవిందయ్య గాజులపల్లి వెంకటేశ్వర రెడ్డి, కోట వెంకట కృష్ణారెడ్డి దిండు నారాయణ తదితరులు సాదు సుగుణ రావు పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలతో ఘన నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వాసవి విద్యానికేతన్‌లో తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : స్థానిక వాసవి విద్యానికేతన్ హై స్కూల్ నందు తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు వెలుగు, వ్యవహారిక భాషా పితామహుడు మన గిడుగు వెంకట రామమూర్తి ఆగష్టు 29, 1863న జన్మించారు. గిడుగు ఉద్యమ కృషి ఫలితంగానే నేడు మనం పాఠశాలల్లో, సమాచార ప్రసార సాధనాల్లో సాహిత్యంలో మాట్లాడే భాషను ఉపయోగించు కుంటున్నామని పాఠశాల ప్రిన్సిపల్ మరియు డైరెక్టర్ కె రంగయ్య తెలిపారు. భారత దేశంలో క్రీడా దినోత్సవ సృష్టికర్త, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ భారత హాకి ఇంద్రజ నైపుణ్యాన్ని ప్రపంచమంతటా చాటి చెప్పారని, ఉన్నత శిఖరాలకు తీసుకు వెళ్ళిన ఘనత ధ్యాన్ చంద్ దే. ఆయన జన్మదినమైన ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకోవడం ఏటా ఆనవాయితీగా వస్తుంది. మెరుపు వేగంలో గోల్ చేయగల మాంత్రికుడిగా ఆయన క్రీడా చరిత్రలో సుస్థిర స్థానం సాధించారన్నారు. పాఠశాల అసెంబ్లీ నందు పిల్లలు తెలుగు తల్లి వేషధారణలో తెలుగు ఔన్నత్యాన్ని తెలుపుతూ తెలుగులో ప్రావీణ్యం సాధించాలని రు రంగయ్య తెలిపారు. పిల్లలకు క్రీడలు నిర్వహించి క్రీడల యొక్క ఉపయోగాలు తెలిపారు.

పుట్టినరోజు వేడుకల్లో ముత్తుముల

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని దద్దవాడ గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బిజ్జం వెంకట రామిరెడ్డి మనువరాలు చిన్నారి పర్ణికారెడ్డి మొదటి పుట్టినరోజు వేడుకలకు గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేయించి, చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తెలుగు భాష దినోత్సవం

విశాలాంధ్ర-కొమరోలు : పట్టణంలోని ఎస్బీఎస్ఆర్ఎం ఎయిడెడ్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ బంధుగుల నారాయణరెడ్డి గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు తెలుగు సంస్కృతి సాంప్రదాయాది వస్త్రాలను ధరించారు. తెలుగు భాష యొక్క గొప్పతనం గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులకు తెలుగు పద్యాలు తెలుగు కవితలు తెలుగు గేయాలు తెలుగు భాష యొక్క గొప్ప తనం గురించి వకృత్వ పోటీలను నిర్వహించారు. అనంతరం పాఠశాల కరస్పాం డెంట్ నారాయణరెడ్డి మాట్లాడారు.

జగనన్న పాలవెల్లువకు రుణాలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా అమూల్ పాల కేంద్రాలలో మహిళలకు 40 వేల నుండి 2లక్షల వరకు రుణాలు అందజేయడం జరుగుతుందని దర్శి పిడిసిసి బ్యాంక్ మేనేజర్ యోగేశ్వరరావు అన్నారు. మండలంలోని నూజిల్లపల్లి గ్రామంలో సచివాలయం వద్ద ఆ గ్రామ సర్పంచ్ చొప్పరపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జగనన్న పాల వెల్లువ రుణ మేళ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల గ్రూపులలో ఉండి అమూల్ పాల్ కేంద్రాలకు పాలు పోసే రైతులకు వారి స్థాయిని బట్టి 40 వేల నుండి 2 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. అందుకోసం అర్హత గల 70 మందిని ఇంటర్వ్యూలు చేసి 80 లక్షలు రుణాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. అమూల్ పాల కేంద్రాల ద్వారా మహిళాభివృద్ధి సాధ్యమన్నారు. ఎంపీడీవో ఎన్‌విఎల్ హనుమంతరావు, పశు వైద్యాధికారిని ఎం విజయలక్ష్మి, వైకెపి ఏపిఎం ఎం హనుమంత రావు, వైద్యాధికారి కాశిరెడ్డి, రూట్ ఆఫీసర్లు మాల కొండయ్య, నాగేశ్వరరావు, సీసీ పి.గురవయ్య, సంఘాలలోని మహిళలు పాల్గొన్నారు.

పాలేటి గంగమ్మకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని పెద అలవలపాడు పంచాయతీ పరిధిలోని వెంగళాపురం గ్రామం సమీపంలో పాలేటి ఒడ్డున వెలిసిన ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భగీరథ పాలేటి గంగాభవాని అమ్మవారిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి అత్యధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. భక్తులు వేకువ జామునే అమ్మవారికి పాల పొంగళ్ళ పెట్టుకుని నైవేద్యం సమర్పించారు. నూతన వాహనములు కొనుగోలు చేసినవారు అమ్మవారి సన్నిధిలో వాహనములకు ప్రత్యేక పూనిర్వహకులు జలు నిర్వహించారు. ఆలయ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

రైతులకు అందుబాటులో యంత్ర సేవా పరికరాలు

విశాలాంధ్ర-తాళ్లూరు : డాక్టర్ వైయస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా పొందిన పరికరాలు రైతులకు అద్దెకు ఇవ్వడానికి అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి బి ప్రసాద్‌రావు అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులో యంత్ర సేవా పథకం ట్రాక్టర్ ద్వారా సేద్యం చేస్తున్న దృశ్యాన్ని పరిశీలించి రైతులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వైయస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా సిహెచ్.సి. గ్రూపులకు అనేక యంత్ర పరికరాలు ఇవ్వడం జరిగిందన్నారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా 1కోటి 43 లక్షల 79,వేల365 రూపాయల ఖరీదు చేసే పరికరాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు.

ఉర్దూ డీఐగా మొయినుద్దీన్

విశాలాంధ్ర-కంభం : కంభం పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు గుంటూరు వారి ఉత్తర్వుల మేరకు డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్ ఉర్దూగా షేక్. మొయినుద్దీన్ బాధ్యతలను చేపట్టారు. ప్రకాశం జిల్లా విద్యాశాఖ అధికారి, పాఠశాల విద్య ప్రాంతీయ విద్యా సంచాలకులు వి.ఎస్ సుబ్బారావుని మర్యాద పూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఈయన కంభం ప్రభుత్వ హై స్కూల్ నందు స్కూల్ అసిస్టెంట్ పిఎస్ ఉర్దూ మీడియంగా పనిచేస్తూ పదోన్నతి పొందారు. ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో ఉన్న ఉర్దూ పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ఉపాధ్యా యులందరి సహకారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తన విధులను నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర-కంభం : కంభం మండలంలోని హజరత్ గూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని, గిడుగు. రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులులర్పించారు. పాఠశాలలో గ్రంథాలయ పుస్తక ప్రదర్శన నిర్వహించి, తెలుగు కవుల చారిత్రక వైభవాన్ని వివరిస్తూ, విద్యార్థులకు కథల పోటీ నిర్వహించి బహుమతులను అందించారు. అనంతరం గ్రామస్థుడు వల్లంశెట్టి వెంకటేశ్వర్లు వారి తండ్రి జ్ఞాపకార్థం గిడుగు. రామమూర్తి పంతులు చిత్రపటాన్ని అందించి, విద్యార్థులందరికీ స్వీట్లు, పెన్నులు మరియు పుస్తకాలను పంపిణీ చేశారు. జనవిజ్ఞాన వేదిక వారు అందించిన 260 గ్రంథాలయ పుస్తకాలను ఆవిష్కరించారు.

గిడుగు రామ్మూర్తి జన్మదినం

విశాలాంధ్ర-టంగుటూరు : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ నిర్వాహకులు గుమ్మడి వర్ధనరాజు ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి పంతులు జన్మదిన వేడుకలు, తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమం మంగళ వారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక గవర్నమెంట్ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు వల్లూరి రామారావు పాల్గొని ప్రసంగించారు. గిడుగు రామమూర్తి పంతులు వ్యవహారిక భాషోద్యమానికి సారథ్యం వహించారు. సామాజికోద్యమ సారథిగా వ్యవహరించారు. సామాన్యులకు అర్థమయ్యేలా గ్రంథ రచనలు వాడుక భాషలో వుండాలని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు గ్రామస్థులు పాల్గొనగా, అనంతరం బిస్కెట్స్ చాక్లెట్స్ పంచటం జరిగినది.

ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహించాలి

విశాలాంధ్ర-ఒంగోలు : విద్యార్థులు లేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని ఎపిటీచర్స్ గిల్డ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె వెంకట్రావు, సిహెచ్ ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం పనిచేయుచున్న 140 ఎయిడెడ్ పాఠశాలలకు గాను 40 పాఠశాలలు పదిమందిలోపు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. 20 పాఠశాలల్లో అసలు విద్యార్థులు లేరు అన్నారు. ఎర్రగొండపాలెం డిఎంబిసి ఉన్నత పాఠశాల, కొమరోలు మండలం నల్లగుంట్ల ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాల, గిద్దలూరు సిసి మరియు ఎస్ పి జి పాఠశాలలు, మార్కాపురం శారదా మరియు ఏబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల, ఒంగోలు జీవీఎస్ మరియు హిందూ ఎయిడెడ్ ఏబీఎం ప్రాథమిక, యుసీఎల్ ప్రాథమిక పాఠశాల,మద్దిపాడు మండలం పెద్ద కొత్తపల్లి ఎయిడెడ్,అద్దంకి మండలం వేలమూరిపాడు ప్రాథమిక పాఠశాల, కొమరోలు మండలం గోపానిపల్లి ఏబీఎంల్లో విద్యార్థులు లేరన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అన్నా

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలం కొమరోలు గ్రామంలో సవరం గోరంట్లయ్య విజయ కుమారిల కుమారుడు శ్రీహర్ష మరియు వనిజలక్ష్మిల వివాహానికి గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సారె వెంకటనాయుడు, కొమరోలు వైస్సార్ సిపి సీనియర్ నాయకుడు నాదెళ్ల వెంగయ్య చౌదరి, గజ్జలకొండ వెంకటేస్వర్లు, వి.మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్య పరీక్షలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి బి.మధు శంకర్ అన్నారు. మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఉమా మహేశ్వరపురం గ్రామంలో సచివాలయంలో మంగళవారం వైయస్సార్ కుటుంబ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మీ గ్రామాల్లో గల డాక్టర్ వైయస్సార్ హెల్త్ క్లినిక్ ల వద్ద కు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామాల్లోని అన్ని సచివాలయాలలో హెచ్ డబ్ల్యు సి హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లు ఉన్నాయన్నారు.

ఎన్జీఓ నేత అబ్దుల్ బషీర్ సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర-కనిగిరి : ఎన్జీవో నేత షేక్ అబ్దుల్ బషీర్ సేవలు చిరస్మరణీయమని మునిసిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. మంగళవారం కామ్రేడ్ బషీర్ తృతీయ వర్ధంతి కార్యక్రమం ఎన్జీవోహంలో నిర్వహించారు. అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ బషీర్ కనిగిరి ప్రాంతంలో పుట్టి ఎన్జీఓ రాష్ట్ర నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఉద్యోగులకు ఏ సమస్యలు వచ్చినా పరిష్కరించేవారని కొనియాడారు. ప్రకాశం జిల్లా నాన్ గెజిటెడ్ ఉద్యోగులు గర్వించ దగ్గ నాయకత్వ పటిమను ప్రదర్శించి ఉద్యోగులకు ఎనలేని సేవలందించి ఘనత ఆయనికే దక్కిందన్నారు. కనిగిరి తాలూక ఎన్జీవో భవనంలో బషీర్ చిత్ర పటానికి ఎన్జీఓ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఎన్జీఓ అధ్యక్షులు పిల్లి రమణారెడ్డి మాట్లాడుతూ బషీర్ ఎన్జీవో సంఘం నాయకులుగా ఉద్యోగులకు చేసిన సేవలు గురించి వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు, దుప్పట్లు వైద్య శాలలోని మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. గార్లపేట రోడ్డులోని వృద్ధుల ఆశ్రమంలో ఐ అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సభ్యులు మదరసాలో బియ్యం పంపిణీ చేశారు. ఎంపిపి దంతులూరి ప్రకాశం, కుటుంబ సభ్యులు జలీల్, హబీబ్, షరీఫుద్దీన్, ఎన్జీవో అసోసియేషన్ నాయ కులు సింగంపల్లి రాంప్రసాద్, నరసింహారావు, షేక్ హజరత్ హలి, డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, మాజీ నాయకులు పెద్దిరెడ్డి, శివరామిరెడ్డి, షేక్ కరీముల్లా, వికలాంగుల హక్కుల రాష్ట్ర అధ్యక్షులు ధూళిపాళ్ళ మల్లికార్జున్, మదర్ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్ రసూల్, గుడ్ హెల్ప్ సంస్థ అధ్యక్షుడు రమేష్ బాబు కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగుభాష ఔన్నత్యాన్ని చాటిచెప్పిన గిడుగు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : తెలుగుభాష ఔన్నత్యాన్ని గిడుగు రామమూర్తి చాటిచెప్పారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరరావు అన్నారు. మండలకేంద్రమైన పుల్లలచేరువులోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో తెలుగు భాషా,క్రీడా దినోత్సవాలను గురువారం ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా గిడుగు.రామమూర్తి, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా హెచ్.ఎం.ఉమామహేశ్వరరావు తెలుగుభాషకు గిడుగు రామమూర్తి చేసిన కృషిని కొనియాడారు. తెలుగుభాష గొప్పదనం గూర్చి ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు,కోటయ్యలు కొనియాడారు. ఈ సందర్భంగా సాంప్రదాయపద్ధతిలో విద్యార్థినులు నృత్యప్రదర్శన నిర్వహించారు.

రెండుసార్లు వేలుముద్రల విధానాన్ని తొలగించాలి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ఇంటింటికి రేషన్ ప్రక్రియలో కార్డు దారుల నుంచి రెండు సార్లు వేలుముద్రలు తీసుకునే విధానాన్ని తొలగించాలని ఎండీయు ఆపరేటర్లు మంగళవారం స్థానిక తహశీల్దార్ నాగూర్‌మీరాకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జులై, ఆగస్టు నెలకు సంబంధించి నిత్యావసర వస్తువుల పంపిణీకోసం ప్రతి కార్డుదారుని నుంచి రెండు సార్లు వేలుముద్రలు తీసుకోవడం సర్వర్ సమస్యల కారణంగా పని ఒత్తిడి అధికమవుతుందని సరుకుల పంపిణీ ఆలస్యం అవుతుందని తెలిపారు. ఈ విధానాన్ని తొలగించి పనిఒత్తిడి తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాకా వెంకటనారాయణ, మస్తాన్, సునీల్, జైపాల్, రహీం, చిన్న నారాయణ, హరికృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు సంఘీభావంగా పాదయాత్ర

విశాలాంధ్ర-దర్శి : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చెప్పట్టిన పాద యాత్ర ఈ నేల 31కి 200రోజులు పూర్తి అవుతున్న సందర్భంగా సంఘీ భావంగా పాద యాత్ర నిర్వహిస్తున్నట్లు పట్టణ టిడిపి అధ్యక్షులు యాదగిరి వాసు తెలిపారు. దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డులో గల కనక దుర్గమ్మ అమ్మవారి గుడి వద్ద నుండి కురిచేడు రోడ్డులోని టీడిపి కార్యాలయం వరకు పాద యాత్ర జరుగుతుంది అన్నారు. గురువారం సాయంత్రం 4గంటలకు పాద యాత్ర మొదలవుతుంది అని అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్ లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొనాలి కోరారు.

క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : విద్యార్థిని విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రోత్సహించాలని ప్రధానోపాధ్యాయురాలు ఎల్ మాధవి లత అన్నారు. మండల కేంద్రమైన ముండ్లమూరు లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రముఖ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని క్రీడా దినోత్సవంగా నిర్వహించు కుంటున్నట్లు తెలిపారు. క్రీడలు మానసికోల్లాసాన్ని పెంచడమే కాకుండా ప్రతిభ ఉన్నవారికి జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో పేరు ప్రఖ్యాతలు లభిస్తాయి అన్నారు. ధ్యాన్ చందు జీవితంలోని ముఖ్యాంశాలను విద్యార్థులకు వివరించారు. ముందుగా ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు ఎస్ కే హజరత్ అలీ, శ్రీనివాసరావు, భారతి, చక్రపాణి, నరసింహారావు, శ్రీదేవి, భావన్నారాయణ, ఏడుకొండలు, ప్రభాకర్, శివరామ కోటేశ్వరరావు, ఆంజనేయులు, ప్రణతి పాల్గొన్నారు.

గిడుగు జయంతి

విశాలాంధ్ర-ముండ్లమూరు : వ్యవహారిక భాషా పితామహునిగా పేరొందిన గిడుగు రామ్మూర్తి తెలుగు భాషకు గొడుగు పట్టారని వక్తలు కొనియాడారు. మండల కేంద్రమైన ముళ్ళమూరులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గిడుగు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్ మాధవి లత అధ్యక్షతన నిర్వహించిన వేడుకలలో తొలుత గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు భాషా ఉన్నతికి కృషి చేసిన మహనీయుడు రామ్మూర్తి అని అన్నారు. తెలుగు భాషాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ కే హజరత్ అలీ, శ్రీనివాసరావు, భారతి, చక్రపాణి, నరసింహారావు, శ్రీదేవి, భావన్నారాయణ, ఏడుకొండలు, ప్రభాకర్, శివరామ కోటేశ్వరరావు, ఆంజనేయులు, ప్రణతి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో తేడాలు ఉంటే సరిచేయండి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేలో తేడాలుంటే సరిచేయాలని డిఎల్ఎస్ఓ కిషోర్ బాబు అన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలు విలేజ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ల్యాండ్ పార్సెల్ నంబర్ల వారిగా (ఎల్‌పిఎన్) సర్వే నెంబర్లు వేసి గట్లు వద్ద హద్దురాలు ఏర్పాటు చేయాలన్నారు. భూముల వివరాలలో తప్పులుంటే భూములు యజమానులను పిలిపించి వారి సమక్షంలో సరి చేయాలన్నారు. ఫీల్డ్ మ్యాప్ తయారుచేసి రికార్డులు పూర్తి చేయాలన్నారు. రీ సర్వేలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఐ సుబ్బారాయుడు, డిప్యూటీ తహసిల్దార్ జి పుల్లారెడ్డి, ల్యాండ్ సర్వే డిప్యూటీ తహసిల్దార్ ఏ స్రవంతి, సీనియర్ అసిస్టెంట్ పి శేషగిరిరావు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల రైతులకు సూచనలు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ఉద్యాన పంటల రైతులకు బెట్ట పరిస్థితులపై యర్రగొండపాలెం ఉద్యాన శాఖ అధికారి పి. ఆదిరెడ్డి సలహాలు తెలిపారు. మంగళవారం యర్రగొండపాలెం మండలంలోని వీరభద్రాపురం, పందివానిపల్లి గ్రామాల్లోని జామ, నిమ్మ తోటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న బెట్ట పరిస్థితుల్లో వేరు కుళ్ళు తెగులు ఆశించి చెట్లు ఎండిపోవడం జరుగుతుందని, దీని నివారణకు ట్రైకోడెర్మా అభివృద్ధి చేసిన పశువుల ఎరువును చెట్ల పాదుల్లో కలుపుకోవాలని సూచించారు. ఒక క్వింటా పశువుల ఎరువుకు ఒక కేజీ ట్రైకోడెర్మాను కలిపి నీడ ఉన్న ప్రదేశంలో వారం నుంచి పది రోజులపాటు నీళ్ల చల్లుతూ పెంచుకోవాలని అలా పెంచిన ఎరువును చెట్ల పాదుల్లో వేసుకోవాలని తెలిపారు. నీటి ఎద్దడిని తట్టుకునేందుకు 19:19:19 లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. సూక్ష్మ పోషకాల లోపాలు నివారించుకోవడానికి ఫార్ములా ఫోర్ లేదా ఫార్ములా సిక్స్ లీటర్ నీటికి ఐదు గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. నిమ్మ తోటల్లో గజ్జి తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 30 గ్రాములు మరియు ప్లాంటోమైసిన్ 3 గ్రాములు 10 లీటర్ల నీటిని కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న బెట్ట పరిస్థితులను బోర్లు ఎండిపోవడం వంటి వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.